క్లుప్తంగా

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ వి. జేసుదాసు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. తాడేపల్లి మున్సిపల్ కార్యాలయంలో 1985 నుంచి ఎన్ఎంఆర్ విధుల్లోరి అంకిత భావంతో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జేసుదాసును ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో మురళి, ఎంటీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విశ్వేశ్వరాలయం వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కాశీ విశాలాక్షీ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. ఉదయాన్నే స్వామి వార్లకు నమక చమకాలతో వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం అమ్మవారికి బిల్వ దళాలతో అష్టోత్తర, సహస్రనామ, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విఘ్నేశ్వరుడికి, నందీశ్వరుడికి అభిషేకాలు చేసి అష్టోత్తర పూజలు చేయనున్నట్లు చెప్పారు. భక్తులకుతీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రేపు పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల్లో జులై 1న పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విమాదేవి శనివారం తెలిపారు. 9,408 మంది పింఛనుదారులకు రూ.6,37,86,500 నగదు అందజేస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం సచివాలయ సిబ్బందితో పాటు అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పింఛన్ల పంపిణీ చేస్తామని చెప్పారు, ఉదయం 5 నుంచి సాయంత్రం వరకు పంపిణీ చేస్తామని , మిగిలిన వారికి మరునాడు అందజేయనున్నట్లు తెలిపారు.

రిమాండ్‌కు వైఎస్సార్ సీపీ నాయకుడు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని దుగ్గిరాల మండలం చుక్కవల్లివారి పాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి వీరయ్య తెనాలి కోర్టులో శనివారం లొంగిపోవడంతో ఆయన్ను బాపట్ల జిల్లా జైలుకు తరలించారు. జూన్ 4న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన నేపథ్యంలో టీడీపీకి చెందిన ఓ కార్యకర్త చికిత్స పొందుతూ మృతి చెందడంతో దాసరి వీరయ్య రెచ్చగొట్టడం వల్లే ఈ గొడవ జరిగిందని ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు వీరయ్యను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించగా ఆయనే స్వయంగా కోర్టులో లొంగిపోవడంతో 14 రోజులు రిమాండ్ విధించి బాపట్ల జిల్లా జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా వైఎస్సార్ సీపీ నాయకులు వీరయ్య అక్రమ అరెస్టను తీవ్రంగా నిరసించారు. వీరయ్యపై అక్రమంగా కేసు నమోదు చేశారని, తుమ్మపూడిలో జరిగిన గొడవకు వీరయ్యకు సంబంధం లేక పోయినా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

10,422 మందికి పింఛన్ల పంపిణీ

తాడికొండ: సామాజిక భద్రతా పింఛన్లు సోమవారం నుంచి ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన అందించే ఎన్‌టీఆర్ ఆరోగ్య భరోసా పింఛన్ ఈ నెల సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే అందించనున్నట్లు పేర్కొన్నారు. తాడికొండ మండలంలో మొత్తం 10,422 మంది లబ్ధిదారులకు గాను మొత్తం రూ.7,12,87,500 నగదు పంపిణీ జరగనుందని ఆమె తెలిపారు.

దోగిపర్రు గ్రామంలో 'బడిబాట'



మేడికొండూరు : మండల పరిధిలోని దోగిపర్రు గ్రామంలో శనివారం ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారంతోపాటు, విద్య అందిస్తారన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించడం వల్ల వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరామ్, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు తోట శివపార్వతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- పట్టించుకోని పశువుల కాపరులు
- నగరంలో రోడ్లపై యథేచ్ఛగా ఆవుల సంచారం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నగరంలో నిడమర్రులో యథేచ్ఛగా సంచరిస్తున్న ఆవులు

మంగళగిరి: గత కొద్ది రోజులుగా మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా వాహనాలకు అడ్డంగా రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్న వందలాది ఆవులను యజమానులు స్వచ్ఛందంగా ఇళ్లకు తీసుకెళ్లాలని విస్తృత ప్రచారం చేయిస్తున్నారు. పత్రిక ప్రకటనలతో పాటు ఆవులను రోడ్లపై వదిలితే యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు ఆవులను గోశాలకు తరలిస్తామని ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు ప్రజారోగ్య రక్షణ, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని ఎంత చెబుతున్నా ఆవుల యజమానులకు చీమ కుట్టినట్లు లేకపోవడం ప్రజలను సైతం విస్మయానికి గురిచేస్తోంది. మంగళగిరి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన పశువుల కాపరులు కొన్ని సంవత్సారాలుగా ఆవులను రోడ్లపైకి వదిలేస్తుండడం విశేషం. గత ప్రభుత్వ పాలనలో ఆవుల కట్టడికి చర్యలు తీసుకుని ఆవులను ఒక చోట వుంచి ఆవుల కొరకు వచ్చిన యజమానులను రూ 3 వేల జరిమాని విధించిన ఘటనలున్నాయి. అయినా మరలా ఆవుల యజమానులు రోడ్లపైకి ఆవులను వదులుతూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇటీవల గౌతమబుద్ధారోడ్డులో రెండు ఎద్దులు రోడ్లపై చేసిన పోరాటానికి ఒకరు గాయపడగా స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అరగంట పాటు నడిరోడ్డుపై ఎద్దులు చేసిన స్వైర విహారంతో అటుగా వాహనదారులు వెళ్లలేక పోయారు. స్థానిక దుకాణదారులు దుకాణాలు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిడమర్రు రోడ్డు రైతు బజార్ వద్ద ఆవులు చేసిన హల్‌చల్‌తో స్థానికులు హడలిపోయారు. రైతుబజార్ వద్ద ఏదైనా వాహనానికి కూరగాయలు సంచి తగిలించినా ఆవులు వెంటపడి లాగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలను ఇన్ని ఇబ్బందులు పెడుతున్నా ఆవుల యజమానులు మాత్రం తమకేమి పట్టనట్లు రోడ్లపైకి ఆవులను వదిలేస్తూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుని ఆవుల యజమానులు ఆవులను సంరక్షించుకునేలా చేసి ఆవులు రోడ్లపై తిరక్కుండా చేసి ప్రజల ఆరోగ్యాలను ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు. కమీషనర్ వి నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఆవుల యజమానులతో సమావేశం నిర్వహించి ఆవులను రోడ్లపైకి వద్దలవద్దని హెచ్చరించడం జరిగిందన్నారు. అయినా కొందరు యజమానులు లెక్కచేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇప్పటికే ఆవుల యజమానులకు నోటీసులు జారీ చేయడంతో మైకులలో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఆవులను యజమానులు సంరక్షించుకోకుంటే ఆవులను గోశాలకు తరలించి యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుద్ధ్య మెరుగుపరచి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే తమ లక్ష్యమని అధికారులు చెప్తున్నారు.



నగరంలో రోడ్డు పక్కన ఇలా..

మలేరియా రహిత సమాజ స్థాపనకు కృషి

సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి



ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది

తెనాలిఅర్బన్: మలేరియా రహిత సమాజ ఏర్పాటులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి కోరారు. మలేరియా మాసోత్సవాల ముగింపు ర్యాలీని పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మలేరియా నియంత్రణకు పోరాటాలు జరుగుతున్నాయని చెప్పారు. 2027 నాటికి మలేరియా కేసులు '0' కు వచ్చే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని వివరించారు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో మలేరియా వ్యతిరేక మాసంగా జరుపుతున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మార్త గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ యనమల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

మేడికొండూరు : మండల పరిధిలోని దోగిపర్రు గ్రామ సమీపంలో ఉన్న యూనివర్సల్ కళాశాలలో శనివారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మమ్మిడాల్ హర్షదీప్తి క్యాన్సర్ లక్షణాలు వివరించారు. మహిళల్లో అధికంగా వచ్చే క్యాన్సర్లు, వాటిని ఎలా గుర్తించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతూ క్యాన్సర్‌కు వయస్సుతో సబంధం ఉండదన్నారు. క్యాన్సర్ విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ముందస్తుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సప్త స్వరాల భక్తి గీతాలాపన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీ భక్తి సంగీత విభావరి జరిగింది. ఆలయ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ, గాయకులు గాదె రత్నారెడ్డి, పెళ్ళూరు కృష్ణారావు, బీఎస్.పోతురాజు, ఎం.నాగేశ్వరరావు, రవికిరణ్ తదితరులు సినీ, భక్తి గీతాలను ఆలపించారు. తబలాపై బాలాజీ, కీబోర్డుపై ఆదాం, ప్యాడ్స్‌పై రాజు చక్కటి వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అట్ల రామకృష్ణారెడ్డి పాల్గొనగా, ప్రేక్షకులను అలరించింది.

వివాదాల నడుమ ఆలయ భూముల కౌలు వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది

పెదకాకాని: ఇరు వర్గాల వివాదాల నడుమ శివాలయం భూములకు కౌలు వేలం పాటలు శనివారం నిర్వహించారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములకు మూడేళ్ల పాటు కౌలు సాగు చేసుకునేందుకు బహిరంగ వేలాన్ని ఉప ఆలయ కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాదరావు, దేవదాయశాఖ ఉప కమీషనర్, పాత గుంటూరు గ్రూపు దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎస్ఎల్‌టీ సౌమ్యులు పర్యవేక్షించారు. పెదకాకాని శివాలయానికి చెందిన 17 ఎకరాల 95 సెంట్లు పొలం చేబ్రోలు మండలంలోని వీరనాయకునిపాలెం పరిధిలో ఉంది. అలానే పెదకాకాని మండలంలోని దేవరాయబొట్లవారిపాలెంలో అర ఎకరం(50 సెంట్లు) భూమి ఉంది. మూడు సంవత్సరాల కౌలు సాగు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించగా గత సంవత్సరం కన్నా ఈ ఏడాది రూ.86,000లు అధిక ఆదాయం లభించినట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. ఎకరాకు సంవత్సరానికి సుమారు రూ.29,383లు కౌలు చెల్లించే విధంగా వేలం దక్కించుకోవడం జరిగిందని డీసీ వివరించారు.

భూముల వేలంలో వివాదం..

గతంలో సాగు చేసుకుంటున్న ప్రస్తుతం వేలంలో పాల్గొనేందుకు వచ్చారు. ఆలయ అధికారులు సాల్వేషన్ సర్టిఫికెట్(ఆస్తి విలువధ్రువీకరణ పత్రం) లేదని, గతేడాది పాటనే తిరిగి కొనసాగించాలని వినతి పత్రం సమర్పించడం, ప్రతి ఏటా మార్చి 31 దాటిన తరువాత చెల్లించారనే కారణంతో వైఎస్సార్ సీపీ వర్గీయులను డిఫాల్టర్‌లుగా ప్రకటించారు. గతంలో పాటలో పాల్గొనేందుకు సాల్వేషన్ సర్టిఫికెట్ అడగలేదని, తాము డిపాజిట్ కట్టి వేలం పాటలో పాల్గొంటామని చెప్పినప్పటికీ బ్యాంకు ద్వారా డీడీ తీసిన వారిని పాట పాడుకునేందుకు అనుమతిస్తామని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. ఆలయ అధికారులు సమాచారం మేరకు పెదకాకాని పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పాటలో పాల్గొనకుండా వైఎస్సార్ సీపీ వర్గీయులు వెనుతిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆలయ డీసీ దాసర శ్రీరామ వరప్రసాదరావును వివరణ కోరగా నిబంధనల ప్రకారమే వేలం పాటలు నిర్వహించడం జరిగిందన్నారు.

పేద విద్యార్థులకు వసతి కల్పించాలని వినతి



నెహ్రూనగర్: గుంటూరు నగరం కోడి గుడ్డు సత్రం హాస్టల్ పనులు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు వసతి కల్పించాలని, హాస్టల్‌ను గురుకుల విద్యాలయంగా మార్చి అన్ని హంగులతో భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో భీమ్ భారత్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్ పనులు పునఃప్రారంభించి పేద విద్యార్థులకు గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా వాడుకలోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా దళిత క్రైస్తవులు చనిపోతే ఆనందపేట శ్మశానవాటికలో వారిని పూడ్చిపెట్టేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో 2013లో ఆనాటి ప్రభుత్వం గోరంట్ల వద్ద 11 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ సదరు స్థలం వివాదంలో ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఉగ్గం సాంబశివరావు, డెన్నీస్‌రాయ్, తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు శిక్షణ కల్పించి, జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు చూపిస్తామని తెలిపారు. ఇంటర్ ఆపై విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు జూలై 3వ తేదీలోపు స్కిల్‌హబ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 96665 45975 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

నిబద్ధతతో కూడిన సేవలతోనే గుర్తింపు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విజయలక్ష్మి, రాజాసుందరబాబు దంపతులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఖాసిం, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో కూడిన సేవలు అందించిన వారిని సమాజంలో శాశ్వతరీతిలో గుర్తింపు దక్కుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసిన బడుగు విజయలక్ష్మి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయునిగా విశిష్టమైన సేవలు అందించిన విజయలక్ష్మి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో చెరగని ముద్ర వేశారన్నారు. మరొక అతిథి ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను బాలికా విద్యకు నిలయంగా తీర్చిదిద్దడంలో హెచ్‌ఎంగా విజయలక్ష్మి విశేష కృషి చేశారని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఆమె సేవలు మరువలేనివన్నారు. గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావంతో సేవలు అందించిన విజయలక్ష్మి సహచర ఉపాధ్యాయులకు మార్గదర్శిగా నిలిచారని అన్నారు. సన్మాన గ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ 36 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో 24 ఏళ్లపాటు ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసే అవకాశం దక్కిందని, ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసే ఉపాధ్యాయులతో స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతల నిర్వహణలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈసందర్భంగా విజయలక్ష్మి, గోళ్ల రాజాసుందరబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవోచంద్రమోహన్, మద్దు ప్రేమ్‌జ్యోతిబాబు, ఎంఈవో నాగేంద్రమ్మ, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం , జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు బి.హైమారావు, పలువురు దళిత ఉద్యోగ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి ఆత్మహత్య

పట్నంబజారు : సచివాలయ కార్యదర్శి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురంలో నివాసం ఉండే అందుగల జోయల్ శ్యామ్‌సన్ (44) గుంటూరు తూర్పు పరిధిలోని 53వ సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఇదే క్రమంలో కొద్దికాలంపాటు 52వ సచివాలయ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలో శనివారం ఉదయం 52వ సచివాలయ కార్యాలయం పైన ఉన్న స్టేషనరీ రూములోకి ఆ సచివాలయ ఉద్యోగి వెళ్లిన క్రమంలో భరించలేని దుర్వాసన వచ్చింది. సదరు ఉద్యోగి పరిశీలించడంలో జోయల్ శ్యామ్‌సన్ ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు పదిరోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈక్రమంలో సచివాలయ ఉద్యోగుల నుంచి సమాచారం అందుకున్న లాలాపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతికి సంబంధించి కుటుంబ కలహాలు కారణమా, ఇతరత్ర ఏమైనా ఉన్నాయా అని దర్యాప్తు చేస్తున్నారు. 52వ సచివాలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నీట్'ను వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న కేశన శంకరరావు

మంగళగిరి: దేశ వ్యాప్తంగా డాక్టర్లను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వైద్య విద్యార్హత పరీక్ష నిర్వహణకు నియమించిన నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ అధ్యక్షుడు కె. శన శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించి, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి పరీక్షను ఎంతో జాగ్రత్తతో.. కఠిన నిబంధనలతో జరపాల్సి ఉండగా.. పేపర్ లీకేజీ కావడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏల నిర్లక్ష్య వైఖరితోనే నీట్ పేపర్ లీకేజీ జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీట్ పేపర్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ప్రతినిధులు కొల్లూరి హనుమంతరావు, ఉప్పాల రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్ వైజర్ కె.కృష్ణకుమారి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు, చిన్నారులు

తాడికొండ: మూడేళ్లు దాటిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి సూచించారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా తాడికొండ వైసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలలో చిన్నారులను చేర్పించి, వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ద్వారా పిల్లల్లో సమగ్ర వికాసానికి పునాదులు వేసినట్లవుతుందన్నారు. ఆటపాటలతో ఆహ్లాదభరిత వాతావరణంలో ప్రీ స్కూల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కిట్‌లు ప్రదర్శించి వాటి ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం తల్లులు, పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు మేలు



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎం. శ్రీధర్, పవన్‌కుమార్, పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కాని కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్ నందు రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 33 సివిలు, 73 క్రిమినల్, 11 ప్రీ లిటిగేషన్, మోటారు వాహన ప్రమాద కేసులు ఏడు కలిపి పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.మూడు కోట్లు పరిహారం కింద అందించారు. ప్రభావతి, ఎ.కిషోర్, ఖాదర్‌హుస్సేన్, ఆర్.దయాకిరణ్ అదాలత్ మెంబర్లుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి



సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న ప్రేమ్‌సాగర్, రమాదేవి

తెనాలిరూరల్: రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండల గ్రామం పెదరావూరులోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై రైతులకు అందజేస్తున్న వరి విత్తనాలను సర్పంచ్ కాకి రమాదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజమ్ లేదా ఎనిమిది గ్రాముల సూడోమోనాస్‌లో కలిపి 24 గంటల అనంతరం చల్లుకోవాలని సూచించారు. వెద పద్ధతి ద్వారా వరి సాగు చేయడం మేలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. పాలడుగు సురేంద్ర, జాస్తి నరేంద్రనాథ్, వీఏఏలు, రైతులు, గ్రామ కార్యదర్శి కె.రామ సుబ్బారావు పాల్గొన్నారు.

వర్షాకాలం.. దోమలువృద్ధి చెందే కాలం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

- రక్షణకు దోమతెరలు వాడాలి
- డీఎంహెచ్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెంది పలు రకాల జ్వరాలు దోమ కాటు ద్వారా వస్తాయని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. దోమ కాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. మలేరియా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు పట్టణంలోని శ్రీనివాసరావుతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్ఓ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు మొదలైన రీత్యా పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల, ఆ ప్రదేశాలు దోమలకు ఆవాసాలుగా మారుతాయని చెప్పారు. నీరు నిల్వ లేకుండా తరచుగా పరిసరాలు శుభ్రపరచుకోవాలన్నారు. ఇళ్లలోని తొట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, టైర్లు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన టీ కప్పులు, పాత రోళ్లలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో నివారణ చర్యలను తరచుగా చేపట్టాలన్నారు. సాయంత్రం సమయంలో వేప పొగ పెట్టడం, దోమతెరలు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమకాటు నుంచి రక్షించుకోవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, దోమల నివారణ చర్యలపై ప్లకార్డులు చేతబూని, నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రాజు నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్, సూదా శివ గణేష్, సుకుమార్, సూరి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.